
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

బుధవారం 17 జనవరి 2024

20న కూనంనేని సాంబశివరావు అభినందన సభ



షాద్‌నగర్, జనవరి 16 : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ నెల 20న షాద్‌నగర్ పట్టణానికి రానున్నారని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేనికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో అభినందన సభ ఏర్పాటు చేస్తున్నందున ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సంక్రాంతి జోష్





వికారాబాద్ జిల్లా పూడూరులో గంగిరెద్దుల విన్యాసాలు



శంకర్‌పల్లిలో పతంగులు ఎగురవేస్తున్న యువకులు



పరిగిలో ముగ్గులు వేస్తున్న యువతులు



కీసరలో హరిదాసు సందడి

రంగవల్లులతో సప్తవర్ణ శోభితంగా వాకిళ్లు

బంధు మిత్రులతో కళకళలాడిన ఇళ్లు

భోగభాగ్యాలందించే భోగి... సకల శుభాలు, సౌఖ్యాలనిచ్చే సంక్రాంతి, కనువిందు చేసే కనుమ, ముచ్చటైన మూడు విశేషాల పెద్ద పండగ సంక్రాంతిని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. భోగి మంటలు.. భోగిపళ్లు... ముత్యాల ముగ్గులు.. గొబ్బెమ్మలు.. పొంగే పాలు.. సన్నాయి రాగాల మధ్య డూడూ బసవన్నలు సందడి చేశారు. కొత్త అల్లుళ్లు... బంధుమిత్రుల మధ్య పండగను ఆనందోత్సహాల మధ్య జరుపుకున్నారు. మూడు రోజుల ముచ్చటైన పండగలో.. ప్రతి ఇంటి ముందు అందమైన రంగవల్లులు కొలువుదీరాయి. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా కేరింతలు కొడుతూ గాలిపటాలు ఎగరవేస్తూ సంతోషంగా గడిపారు. రైతులకు పంటలు చేతికొచ్చే సమయాన మొట్టమొదటి పండగ కావడంతో రైతుల ఇళ్లల్లో పండగ వాతావరణం అంబరాన్నంటింది. ప్రతి ఇంట్లో పిండివంటలు ఘుమఘుమలాడాయి. వివిధ ప్రాంతాల్లో కోడి పందేలు కూడా నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ జనవరి 16



శామీర్‌పేటలో ముగ్గులు వేస్తున్న యువతులు



కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట్‌లో పిండివంటలు చేస్తున్న కుటుంబ సభ్యులు



ఆమనగల్లులో ముగ్గులు వేస్తున్న యువతులు

చెంచుల జీవన ప్రమాణాల పెంపే

పీఎం జన్‌మన్ లక్ష్యం

- చెంచులతో వర్చువల్ సమావేశంలో ప్రధాని మోదీ
- కడ్తాల హాస్టల్‌లో వీక్షించిన చెంచులు, అధికారులు

ఆమనగల్లు, జనవరి 16: చెంచులు, ఆదివాసీల జీవన ప్రమాణ స్థాయి పెంపే లక్ష్యంగా దేశంలో ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ్ మహాఅభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. 'జన్‌మన్' కార్యక్రమం అమల్లో భాగంగా సోమవారం జిల్లాలోని చెంచులు ప్రధానమంత్రి నిర్వహించిన వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. కడ్తాలలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హెచ్‌డబ్ల్యూవో రాములు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సమావేశానికి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ సుశీల్‌కుమార్ విమల్, రాష్ట్ర గురుకుల పాఠశాలల కార్యదర్శి నవీన్ నికొలస్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక, డీఆర్డీవో ప్రభాకర్, సీఈవో దిలీప్‌కుమార్, ఎస్టీ వెల్ఫేర్ అధికారి కె.ఇ.రామేశ్వరిదేవి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లోని 11 ఆవాస ప్రాంతాల చెంచులు వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో 18 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఆదివాసీలతో ప్రధానమంత్రి ముఖాముఖి కార్యక్రమం కొనసాగింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల చెంచుల స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. చెంచుల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా రూ.24వేల కోట్లతో అమలుచేస్తున్న 'పీఎం జన్‌మన్'తో ఒనగూడే ప్రయోజనాలపై మోదీ వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పక్కాఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ఆరోగ్య పరిరక్షణ, నీటి సౌకర్యం, ప్రతీ ఇంటికి విద్యుత్, అంగన్వాడీల ఏర్పాటు, సోలార్ దీపాలు, మొబైల్ టవర్లు, ఒకేషనల్ విద్యా కేంద్రాల ఏర్పాట్లు తదితర కార్యక్రమాలు చేపడుతామని పీఎం వెల్లడించారు. రూరల్ హౌసింగ్ స్కీం కోసం తొలి విడత రూ.540 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో తొలివిడత లక్ష మంది కుటుంబాలకు లబ్ధి చేకూర్చుతామన్నారు. ఆదివాసి కుటుంబాలకు ప్రతి సంక్షేమ పథకం అందించడమే 'జన్‌మన్' లక్ష్యం అని మోదీ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ముందు అధికారులు, నాయకులు ఈ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, జీసీసీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. పీఎం సందేశానంతరం కలెక్టర్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ఎంపీపీ ఆనంద్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, రాష్ట్రసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలు చెంచులకు కుల ధ్రువీకరణపత్రాలు, ఆధార్, ఆయుష్మాన్ భారత్, కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీల అభివృద్ధి ప్రత్యేక అధికారి పద్మ, ఏడీఏ సుజాత, డీపీవో శ్రీకాంత్, కడ్తాల్, ఆమనగల్లు మండలాల తహసీల్దార్లు ముంతాజ్, లలిత, ఎంపీడీవోలు రామకృష్ణ, ఫారూఖ్ హుస్సేన్, సీఐ శివప్రసాద్, ఏవోలు శీలత, అరుణ, పరిక్షిత్, కిరణ్, ఎంపీవో మధుసూదనచారి, సీడీపీవో సక్కుబాయి, ఇతర ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వర్చువల్‌లో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోదీ



పీఎం జన్‌మన్ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శశాంక



హిమాయత్‌నగర్‌లో బోనాలతో కట్టమైసమ్మ ఆలయానికి తరలుతున్న మహిళలు

హిమాయత్‌నగర్‌లో ఘనంగా కట్టమైసమ్మ బోనాలు

మొయినాబాద్ రూరల్, జనవరి 16: హిమాయత్‌నగర్‌లోని గండిపేట చెరువు సమీపంలోని కట్టమైసమ్మ బోనాలను గ్రామ సర్పంచ్ ముదిగొండ మంజులరవియాదవ్ అధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డిల్లెంపల్లెం డప్పులచప్పుళ్ల మధ్య ఉత్సవాలు వైభవంగా జరిగాయి. తొట్టెల ఊరేగింపులో యువత పాల్గొన్నారు. అలాగే అజీజ్‌నగర్‌లో 3రోజుల పాటు జరిగే బోనాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు రాత్రి పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. వేడుకల్లో మాజీ స్పీకర్ మధుసూదనచారి, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ గడల శ్రీనివాస్, సర్పంచ్ సంధ్యశ్రీశైలం, నాయకులు టి.శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధీర్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

నిరుపయోగం!



అప్పటి ఎమ్మెల్యే తీగల ప్రారంభించిన శిలాఫలకం



వృథాగా ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

మహేశ్వరం, జనవరి 16 : కారణమేంటో తెలియదు కానీ, మహేశ్వరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం 2018లో నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు వృథాగానే పడి ఉంది. ఈ కార్యాలయాన్ని కోటి రూపాయల నిధులతో 2018 సెప్టెంబరు 6వ తేదీన అప్పటి ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యాలయం అన్ని సౌకర్యాలు కలిగి ఉన్నప్పటికీ 2018లో మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలిచిన సబితా ఇంద్రారెడ్డి ఈ కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఆమె ఈ కార్యాలయానికి బదులుగా జిల్లెలగూడలో మరో క్యాంపు కార్యాలయాన్ని నిర్మించారు. ఆమె కార్యక్రమాలన్నీ అక్కడి నుంచే నిర్వహించడంతో మహేశ్వరంలోని క్యాంపు కార్యాలయం వృథాగా పడి ఉంది. సకల సౌకర్యాలతో నిర్మించిన ఈ కార్యాలయాన్ని అలా వృథాగా ఉంచకుండా ఇతర కార్యాలయాలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలి

- మైనారిటీలు సైనికుల్లా కష్టపడాలి
- తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ
- గాంధీభవన్‌లో మైనారిటీల సమావేశం
- చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి నాయకులు హాజరు

రంగారెడ్డి అర్బన్ జనవరి 16 : పార్లమెంట్ ఎన్నికలకు సమయత్తం కావాలని తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. గాంధీ భవన్‌లో చేవెళ్ల పార్లమెంట్ మైనారిటీ సహాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేలా మైనార్టీలు సైనికుల్లా కష్టపడాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఏఐసీసీ నేతలు రోహిత్ చౌదరి, మన్సూర్ అలీఖాన్, ఫహీమ్ జగదేవ్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ



దేవాలయం చుట్టు తిరుగుతున్న బండ్లు

ఘనంగా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కొందుర్గు, జనవరి, 16: కొందుర్గు మండలం వెంకిర్యాల శివారు చింతల్(సంజీవపురం)లో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవాలయంలో ప్రతి సంవత్సరం జనవరిలో సంక్రాంతి నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా బ్రహ్మోత్సవాలు (జాతర) నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సుప్రభాతం, విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం, ఆలయ ప్రవేశం, వినాయక పూజ, అభిషేకం, గణపతి హోమం, శకటోత్సవం (బండ్లు తిరుగుట)ను నిర్వహించారు. 16వ తేదీ మంగళవారం స్వామి వారికి సుప్రభాతం, అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ, వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాల సర్పంచులు లింగమయ్యగౌడ్, నర్సింలు, శ్రీధర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు చెక్కల గోవింద్, మాసయ్యగౌడ్, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, భూషయ్య, చెక్కల రమేష్, సుధాకర్, రాజ నర్సింహ్మారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన ఆధార్ కష్టాలు

- ప్రత్యేకంగా మూడు కేంద్రాలు
- పోస్టాఫీసులో అదనంగా కౌంటర్లు


తాండూరులో ఏర్పాటు చేసిన కొత్త ఆధార్ సెంటర్

తాండూరు, జనవరి 16: తాండూరు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఆధార్ కష్టాలు తొలగనున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం మూడు తాత్కాలిక సెంటర్లను మంజూరు చేసింది. దీంతో మంగళవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన మూడు సెంటర్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలతో కలెక్టర్ నారాయణరెడ్డి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటుకు ఆదేశించారు. మంగళవారం ఏర్పాట్లు పూర్తి కావడంతో బుధవారం (నేటి) నుంచి కొత్త కేంద్రాల్లో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు ఆర్డీవో సూచన మేరకు మున్సిపల్ అధికారులు పాత మున్సిపల్ భవనంలో మూడు గదులను, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్‌ను సమకూర్చారు. మూడు నెలలుగా ఆధార్‌కార్డు అప్‌డేట్, కొత్త నమోదు కోసం పోస్టాఫీస్‌లో ఉన్న ఒక్క ఆధార్ సెంటర్‌తో అవస్థలుపడ్డారు. పొద్దున్నే 4గంటల నుంచి క్యూలో నిలిచిన ఉండే పరిస్థితి ఉండేది. మూడు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడంతో వినియోగదారుల కష్టాలు తీరనున్నాయి. ఈ విషయమై ఆంధ్రజ్యోతి దినపత్రిక మెయిన్ ఎడిషన్‌లో ఆధార్ కష్టాలపై కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌టీయూ రాష్ట్ర సెక్రెటరీ ప్రదీప్‌సింగ్

మేడ్చల్ టౌన్ జనవరి 16: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కనుమ రోజు మంగళవారం మేడ్చల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిదులు మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌టీయూ రాష్ట్ర సెక్రటరీ ప్రదీప్‌సింగ్ తదితరులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌టీయూ రాష్ట్ర సెక్రటరీ ప్రదీప్‌సింగ్

ఈ నెల 22నుంచి ఏకేఆర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత అవగాహన సదస్సు


దుర్గాప్రసాద్

వికారాబాద్, జనవరి 16:పట్టణంలోని ప్రముఖ శిక్షణ సంస్థ ఏకేఆర్ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 22, 23, 24 తేదీల్లో టెట్, డీఎస్సీ పైన ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బీవీ.రమణ తెలిపారు. ఈ అవగహన సదస్సుకు కాకినాడకు చెందిన పెడగోజి, పర్స్పెక్టివ్ నిపుణులు దుర్గా ప్రసాద్ హాజరవుతున్నారని ఆయన చెప్పారు. త్వరలో ప్రభుత్వం నిర్వహించబోయే మెగా డీఎస్సీ, డీఎడ్, బీఎడ్, పూర్తి చేసిన అభ్యర్థులకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేస్తున్న ఈ సదుస్సును అభ్యర్థులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సదస్సు వివరాలకు 9441022571 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో మూడు రోజులు అంతరాయం

బొంరాస్‌పేట్, జనవరి 16: మండలంలోని వివిధ విద్యుత్ ఉప కేంద్రాల్లో మూడు రోజుల పాటు మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బొంరాస్‌పేట్ ఏఈ నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17న బొంరాస్‌పేట్ ఫీడర్, తుంకిమెట్ల, బురాన్‌పూర్, బొంరాస్‌పేట్ క్రషర్ ఫీడర్, బాపల్లితండా ఫీడర్, బురాన్‌పూర్, 18న మెట్లకుంట, ఏర్పుమళ్ల, కొత్తూర్, బాపల్లితండా, మదన్‌పల్లి, బురాన్‌పూర్, సాలిండపూర్, 19న ఈర్లపల్లి ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



చింతామణిపట్నంలో బోనమ్మకు బోనాలు

తాండూరు రూరల్‌: చింతామణిపట్నంలో గ్రామస్తులు మంగళవారం గ్రామ దేవత బోనమ్మకు బోనాలు సమర్పించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ విమలమ్మ, ఉప సర్పంచ్‌ విక్రంరెడ్డి, పి.వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌ శివరాజ్‌, యువకులు బాలకృష్ణ, నర్సింహులు, మల్లేష్‌, రాంరెడ్డి, వెంకటయ్యగౌడ్‌, హరి చంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నర్సింహులు గౌడ్‌, మొగులప్ప, మాన్యప్ప, పి.నర్సప్ప, కుర్వ మల్లప్ప, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం

- తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దంపతులు
- వందల సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఘట్‌కేసర్‌ రూరల్‌, జనవరి 16: ఎదులాబాద్‌లో గోదా సమేత శ్రీమన్నార్‌ రంగనాయక స్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో గోదాదేవి, రంగనాకయకస్వామి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. స్థానిక ఎమ్మెల్యే చామకూర మలారెడ్డి ఆయన సతీమణి కల్పనారెడ్డిలు అమ్మవారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. మాంగళ్యధారణ, అక్షితారోహణ, హారతి కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి తలంబ్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌ సురేష్‌ ఆయన సతీమణి తులసి, ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, గోవిందా చార్యులు, శేషాచార్యులు, పురుషోత్తమాచార్యులు, సేనామాచార్యులు, రఘునాధాచార్యులు, వరప్రసాదాచార్యులు, అచ్యుతాచార్యులు, పవనకుమాచార్యులు, ఆదిత్య చార్యులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో శ్రీమన్నార్‌ రంగానాయకస్వామి కల్యాణం



తలంబ్రాలు, పట్టువస్త్రాలు తెస్తున్న మల్లారెడ్డి

కనుల పండువగా గోదారంగనాయకుల కల్యాణోత్సవం

కడ్తాల్‌, జనవరి 16: మక్తమాదారంలోని ప్రసిద్ధ రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం గోదారంగనాయకస్వామి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మక్తమాదారం, సమీప గ్రామాల భక్తులు తలంబ్రాలతో ఆలయానికి తరలివచ్చారు. అనువంశిక ధర్మకర్త తిరుమల వింజమూరు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో అర్చకుడు ఆదిత్యచారి, రంగరాజన్‌ కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నర్సింహ, సర్పంచ్‌ సులోచనసాయిలు, ఎంపీటీసీలు మంజులచంద్రమౌళి, నాయకులు బొప్పిడి గోపాల్‌, రంగయ్య, బాల్‌రాజ్‌, చెన్నయ్య, నారాయణ, నర్సింహాగౌడ్‌, రమేశ్‌, సుమన్‌, సాయిలు పాల్గొన్నారు.



స్వామి వారలకు కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



మాట్లాడుతున్న రాంప్రసాద్‌

దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

కొడంగల్‌, జనవరి 16: దేశ సంస్కృతీ సంప్రదాయాలను ఆర్‌ఎస్‌ఎస్‌, హిందూ వాహిని కార్యకర్తలు కాపాడుకునేందుకు కృషి చేయాలని ఆర్‌ఎస్‌ఎస్‌ తెలంగాణ ప్రాంత ప్రచారక్‌ జీ.రాంప్రసాద్‌ అన్నారు. కొడంగల్‌ పట్టణంలోని మహాదేవ శివాలయం ఆవరణలో సోమవారం రాష్ట్రీయ స్వయం సేవక్‌ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతమాత చిత్ర పటానికి పూలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. యోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రాముల వారి పూజిత అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు జగన్మయానందస్వామి, విశ్రాంత ఉపాధ్యాయులు రాధాకృష్ణ, హిందు వాహిని, ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే జనరల్‌ మేనేజర్‌ను కలిసిన ఎంపీ

వికారాబాద్‌, (ఆంధ్రజ్యోతి) జనవరి 16: సౌత్‌సెంట్రల్‌ రైల్వే జనరల్‌ మేనేజర్‌ అరుణ్‌కుమార్‌ జైన్‌ను మంగళవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి వ్యక్తిగతంగా కలిసి తన పార్లమెంట్‌ నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను నివేదించారు. వికారాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గంలోని గోదంగూడ వద్ద గల ఆర్చ్‌ బ్రిడ్జికి గార్డర్స్‌ పెట్టడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన జనరల్‌ మేనేజర్‌ దృష్టికి తెచ్చారు. ప్రత్యామ్నాయ చర్యలపై చర్చించారు. కాగా తాను వివరించిన రైల్వే సమస్యలపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించారని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.



రైల్వే జనరల్‌ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి



ఆవులను చూస్తున్న మాజీ హోం మంత్రి మహమూద్‌ అలీ

సర్దార్‌నగర్‌ సంతకు మాజీ హోం మంత్రి

షాబాద్‌, జనవరి 16 : మాజీ హోం మంత్రి మహమూద్‌ అలీ మండలంలోని సర్దార్‌నగర్‌ పశువుల సంతను మంగళవారం సందర్శించారు. తన పొలం కోసం రెండు ఆవులు కావాలని సర్దార్‌నగర్‌ మార్కెట్‌లో తిరిగి ఆవులను చూశారు. మంగళవారం కనుమ కావడంతో మార్కెట్‌లోకి పశువులు తక్కువగా వచ్చాయి. దీంతో మరోసారి వస్తానని ఆయన చెప్పారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్‌ నర్సింగ్‌రావు, కార్యదర్శి సుజాత, గ్రామస్తులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, జైపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మమ్మలతో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ప్రముఖులను కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జనవరి 16: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటి వెంకట్‌రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క, జూపల్లి కృష్ణారావు, శాసన సభ స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌, మండలి చైర్మన్‌ సుఖేందర్‌రెడ్డి, సీఎం సతీమణి గీతారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మమ్మ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే హైదరాబాద్‌లో వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రులను కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

ఏపీ పీసీసీ చీఫ్‌గా షర్మిల నియామకం హర్షణీయం

ఆమనగల్లు, జనవరి 16: ఆంధ్రప్రదేశ్‌ పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్‌.షర్మిల నియామకం హర్షణీయం అని కాంగ్రెస్‌ జిల్లా నాయకుడు చీమర్ల అర్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీ అధిష్ఠానం షర్మిల నియామక ప్రకటన అనంతరం ఆయన ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. షర్మిల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తుందని అర్జున్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. షర్మిలను నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేసీ.వేణుగోపాల్‌, సహకరించిన కాంగ్రెస్‌ నాయకులకు ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



షర్మిలకు శుభాకాంక్షలు తెలుపుతున్న అర్జున్‌రెడ్డి

విలువలు పాటించిన నేత జైపాల్‌రెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్‌/తలకొండపల్లి, జనవరి 16: కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నేత దివంగత సూదిని జైపాల్‌రెడ్డి తన జీవిత కాలంలో విలువలతో కూడిన రాజకీయాలు చేసి ప్రజలకు సేవలందించారని పలువురు నాయకులు అన్నారు. మంగళవారం జైపాల్‌రెడ్డి 82వ జయంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన రాజకీయ వైతాళికుడని అన్నారు. ఆమనగల్లులోని రాజీవ్‌ చౌరస్తాలో మాజీ జెడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు జగన్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నర్సింహల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్‌ ముఖ్య అతిథులుగా హాజరై జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కేంద్రమంత్రిగా, ఎంపీగా జైపాల్‌రెడ్డి దేశానికి, రాష్ట్రానికి, ఎమ్మెల్యేగా కల్వకుర్తి నియోజకవర్గానికి అందించిన సేవలను వారు కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కాంగ్రెస్‌ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.రాములు, మల్లయ్య, ఖాదర్‌ఖాద్రీ, మానయ్య, జె.యాదయ్య, కృష్ణనాయక్‌, ఫరీద్‌, శ్రీకాంత్‌, మల్లేశ్‌నాయక్‌, అలీం, శ్రీశైలం, నాజర్‌, మైసయ్య, సురేశ్‌, రఫీ, మహేశ్‌, రాఘవేందర్‌, రహీమ్‌, ఖాదర్‌, యాదయ్య, కిషన్‌ తదితరులు పాల్గొన్నారు. కడ్తాలలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్‌, లయన్స్‌ క్లబ్‌ జిల్లా మాజీ గవర్నర్‌ జీ.చెన్నకిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. జిల్లా, మండల నాయకులు చేగూరి వెంకటేశ్‌, జహంగిర్‌బాబ, లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్‌, మల్లేశ్‌గౌడ్‌, జగన్‌, కృష్ణనాయక్‌, బుచ్చయ్య, శంకర్‌, బాల్‌రాజ్‌, బిక్షపతి, రమేశ్‌, భరత్‌, శ్రీకాంత్‌, నర్సింహ పాల్గొన్నారు. తలకొండపల్లి, వివిధ గ్రామాల్లో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి జయంతిని నిర్వహించారు.



ఆమనగల్లులో జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌

మోహన్‌రెడ్డి, అంజయ్య, మహేశ్‌, అజీం, రవీందర్‌, చెన్నకేశవులు, రఘురాములు, వెంకట్రామ్‌రెడ్డి, రమేశ్‌, శంకర్‌, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

స్ఫూర్తి స్థల్‌ను సందర్శించిన పలువురు ప్రముఖులు

హైదరాబాద్‌ నెక్లెస్‌ రోడ్డులో గల స్ఫూర్తి స్థల్‌ను ఎంపీ రాములు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వంశీచంద్‌రెడ్డి, జైపాల్‌ యాదవ్‌, బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారి, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, రాష్ట్ర ఫుడ్‌ కమిషన్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, అధికార ప్రతినిధి బాలాజీసింగ్‌, జైపాల్‌రెడ్డి సోదరులు పద్మారెడ్డి, మనోహర్‌రెడ్డి, కుమార్‌, అరవింద్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి సందర్శించి జైపాల్‌రెడ్డికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజితారెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, వైస్‌ ఎంపీపీ అనం తరెడ్డి,



షాద్‌నగర్‌: జైపాల్‌రెడ్డికి నివాళి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్‌, కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

గూడూరు గోపాల్‌రెడ్డి, టి.వేణుగోపాల్‌, జి.కేశవులు, సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌గౌడ్‌, ఎస్‌.కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ అపరమేధావి జైపాల్‌రెడ్డి : ఎమ్మెల్యే శంకర్‌

షాద్‌నగర్‌: ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాల్లో జన్మించిన జైపాల్‌రెడ్డి రాజకీయాల్లో అపర మేధావిగా పేరుగాంచారని షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ కొనియాడారు. జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్‌ నెక్లెస్‌ రోడ్డులో నిర్మించిన స్ఫూర్తి స్థల్‌ వద్ద జరిగిన కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా నుంచి ఎంతోమంది రాజకీయాల్లోకి వచ్చినా కాంగ్రెస్‌ పార్టీలో కీలక వ్యక్తిగా ఎదిగి కేంద్ర మంత్రి పదవులను అధిరోహించిన ఘనత జైపాల్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజా సేవలో ఆయన చూపిన బాటలోనే తామంతా నడుస్తామని ఎమ్మెల్యే అన్నారు.

నివాళి అర్పించిన మాడ్గుల నాయకులు

మాడ్గుల: మాడ్గులలో జైపాల్‌రెడ్డి జయంతిని మండల కాంగ్రెస్‌ నాయకులు నిర్వహించారు. జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. కేంద్ర మంత్రిగా నియోజకవర్గంలో, రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. తెలంగాణ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. అనంతరం నగరాని వెళ్లి స్ఫూర్తి స్థల్‌ వద్ద నివాళి అర్పించారు. సర్పంచ్‌ జంగయ్యగౌడ్‌, ఎంపీటీసీ పాండుగౌడ్‌, నాయకులు జంగయ్య, యాదయ్యగౌడ్‌, మోహన్‌రెడ్డి, అంజయ్య, భాస్కర్‌, సూదిని వెంకట్‌రెడ్డి, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగరంలో జైపాల్‌రెడ్డి విగ్రహం వద్ద కేక్ కట్‌చేస్తున్న మాడ్గుల కాంగ్రెస్ నాయకులు



కడ్తాల్‌లో జైపాల్‌రెడ్డి జయంతి వేడుకల్లో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

రాష్ట్రస్థాయి పోటీల్లో చించల్‌పేట్‌ విద్యార్థి ప్రతిభ

నవాబుపేట, జనవరి 16: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంస్థ నిర్వహించిన 'ఈజ్‌ ఫార్మల్‌ స్కూలింగ్‌ ఇన్‌ నెసెసరీ ఫర్‌ సక్సెస్‌' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో నవాబుపేట మండలం చించల్‌పేట్‌ గ్రామానికి చెందిన వివేక్‌ వర్ధన్‌ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. పోటీల్లో 13 రీజియన్‌ల నుంచి మొత్తం 1800 మంది విద్యార్థులు పాల్గొనగా ఫైనల్‌ స్థాయిలో 180 మంది విద్యార్థులు పోటీ పడ్డారు. అందులో వివేక్‌వర్ధన్‌ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. వివేక్‌ జిల్లాలోని శివారెడ్డిపేట్‌ బాలుర సాంఘిక సంక్షేమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మంగళవారం అభినందించారు. రానున్న రోజుల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు కాలే శేఖర్‌, తాలూకా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌, కార్యదర్శి ప్రభాకర్‌, చించల్‌పేట్‌ సెక్టార్‌ అధ్యక్షుడు మాల శేఖర్‌, ఏకమామిడి అధ్యక్షుడు లాలయ్య అభినందించారు.



వివేక్‌ వర్ధన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

క్రీడలతో మానసికోల్లాసం



వెల్జాల్‌లో బహుమతులు అందజేస్తున్న సీఎల్‌.శ్రీనివాస్‌

తలకొండపల్లి, జనవరి 16: క్రీడలతో మానసిక ఉల్లాసం, స్నేహ సంబంధాలు ఏర్పడుతాయని బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్‌.శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన వీపీఎల్‌ క్రికెట్‌ టోర్నీ మంగళవారం ముగిసింది. వీపీఎల్‌ వ్యవస్థాపకుడు సీహెచ్‌ విష్ణువర్ధన్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శ్రీనివాస్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత టీంకు శ్రీనివాస్‌ సొంతంగా రూ.10వేలు అందజేశారు. విన్నర్‌, రన్నర్లకు విష్ణువర్ధన్‌ వెండి నాణాలను బహూకరించారు. క్రీడాకారులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని శ్రీనివాస్‌యాదవ్‌ కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్‌ సభ్యుడు ముజుబుర్‌ రహెమాన్‌, ఎంపీటీసీ అంబాజి, ప్యాక్స్‌ వైస్‌చైర్మన్‌ రవి, ఉప సర్పంచ్‌ అజీజ్‌, నాయకులు వెంకటేశ్‌, సాయికుమార్‌, అవినాశ్‌, గోపాల్‌, కృష్ణ, ఖయ్యూం, విజయ్‌కుమార్‌, యాదయ్య, పెంటయ్యగౌడ్‌, ఆరిఫ్‌, సుధాకర్‌, రాఘవేందర్‌, విజయ్‌, శేఖర్‌, శ్రీను, రషీద్‌, శ్రీశైలం, రాము, లింగం, కృష్ణ, సుల్తాన్‌ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ఆమనగల్లు: యువత క్రీడల్లో రాణించాలని నల్లగొండ విజిలెన్స్‌ సీఐ గజ్జె చరమందరాజు, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము పిలుపునిచ్చారు. ఆమనగల్లులోని అయ్యప్పకొండ వద్ద ఆమనగల్లు క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా క్రికెట్‌ టోర్నీ మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజేతకు రూ.20వేలను సీఐ రాజు, రన్నర్స్‌కు రూ.10వేలను రాము సమకూర్చి అందజేశారు. క్రీడాకారులకు వ్యక్తిగతంగా షీల్డ్‌లను బహూకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలన్నారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని అన్నారు. నిర్వాహకులు, నాయకులు టిల్లు యాదవ్‌, శివసూర్య, కె.ప్రసాద్‌, సైదులు, గణేశ్‌, నరేశ్‌, అశోక్‌, గోపి, భాస్కర్‌, మల్లేశ్‌, రాజు పాల్గొన్నారు.



కొడంగల్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

సీఎం సహకారంతో క్రీడాకారులకు నూతనుత్తేజం

- కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- కబడ్డీ పోటీల్లో పాల్గొన్న 40 జట్ల క్రీడాకారులు

కొడంగల్‌, జనవరి 16: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో క్రీడాకారులకు నూతనుత్తేజాన్ని నింపుతున్నట్లు టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌, సర్పంచ్‌లు రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ సంజీవరెడ్డి, యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకులు కృష్ణంరాజు, రెడ్డి శ్రీనివాస్‌ అన్నారు. యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను సోమవారం స్థానిక సిటిజన్‌ క్లబ్‌ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్టేడియాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, హాకీ, వాలీబాల్‌, క్రికెట్‌ తదితర క్రీడల్లో పాల్గొనేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గతంలో కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఇలాంటి క్రీడా పోటీలు మరెన్నో నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న 40 జట్లు

కొడంగల్‌లో యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణలోని వివిధ జిల్లాలు, కర్ణాటక ప్రాంతానికి చెందిన పలువురు క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో 40జట్లు పోటీల్లో తలపడగా సెమీఫైనల్‌, ఫైనల్‌ పోటీలు జరగనున్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు స్థానిక నాయకులు, సీనియర్‌ క్రీడాకారులు ప్రోత్సాహ బహుమతులు అందిస్తున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.80వేలు నగదు, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.30వేలు, నాలుగవ బహుమతి రూ.20వేలు నగదుతో పాటు మెమొంటోలు, షీల్డ్‌లు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాములు, ఎఐ భరత్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, నాయకులు కేవీ రాజేందర్‌, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

తుది దశలో ఆన్‌లైన్‌ ఎంట్రీ

- నేటితో గడువు పూర్తి
- సందేహాలపై స్పష్టత కరువు
- త్వరలో ఊరూ వాడల్లో 'ఇందిరమ్మ' కమిటీలు
- మార్గదర్శకాలు వచ్చాకే ముందుకు
- లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు ఇవ్వని సర్కార్‌



తాండూరు, జనవరి 16: కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉపయోగపడిన గ్యారెంటీలైన మహలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. 2023 డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6వరకు ఈ దరఖాస్తులను వార్డు, గ్రామసభల్లో తీసుకున్నారు. అయితే, 'అభయహస్తం' ఆరు గ్యారెంటీల ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ ఎంట్రీ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఈనెల 17వ తేదీ(నేడు)తో ఈ ప్రక్రియ పూర్తి కానుంది. అయితే తదుపరి చర్యలపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైతే మున్సిపాలిటీలు, మండలాల వారీగా ఆన్‌లైన్‌ ప్రక్రియను పూర్తి చేసి దరఖాస్తు ఫారాలను భద్రపరిచారు.

సందేహాలపై స్పష్టత ఏది?

గృహజ్యోతి పథకం కింద కుటుంబానికి ప్రతీనెల 200యూనిట్ల ఉచిత విద్యుత్‌ అందించే పథకం, కానీ ఒక్క ఇంట్లో రెండు మీటర్లుంటే, ఇద్దరికీ ఫ్రీకరెంట్‌ ఇస్తారా? పట్టణాల్లో ఎక్కువగా అద్దె ఇళ్లల్లో ఉంటారు. వీరిద్దరికీ ఫ్రీకరెంట్‌ ఇస్తారా? అన్న దానిపై స్పష్టత లేదు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం కింద ప్రతీనెల రూ.2500 ఆర్థికసాయం, రూ.500లకు గ్యాస్‌ సిలిండర్‌కు సంబంధించి గ్యాస్‌ కనెక్షన్‌ నెంబర్‌ సరఫరా చేస్తున్న కంపెనీ పేరు వివరాలను అడిగారే తప్ప అందులో యజమాని మహిళల, పురుషులా అనేది వెల్లడించలేదు. దీంతో గ్యాస్‌ బండ మహిళల పేరిట ఉండాలా? పురుషుల పేరిట ఉండాలా? ఆధార్‌ అప్‌డేట్‌ కచ్చితమా? అనే సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో ఒకరి కన్నా ఎక్కువ మంది మహిళలు ఉంటే వారికి ప్రభుత్వం అందించే రూ.2500 ఆర్థిక సాయం వర్తిస్తుందా? అని అడుగుతున్నారు. రైతుభరోసా పథకం కింద రైతులకు, కౌలు రైతులకు ఏటా ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు పథకానికి సంబంధించి రైతుబంధు పొందుతున్న రైతులు ఈ దరఖాస్తులో నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదన్న వారు రెండ్రోజుల తర్వాత రైతుబంధు పొందుతున్న వారు సైతం దరఖాస్తులో పేర్కొనడంతో రైతులు సందిగ్ధంలో ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీలు

కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఆరుగ్యారెంటీలకు వార్డులు, గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీలు వేసే అవకాశాలున్నాయి. కమిటీలో ప్రజాప్రతినిధులు, నాయకులు వుండే అవకాశాలున్నాయి.

ఎంపికలో అడ్డంకులు

ఐదు గ్యారెంటీలలో లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సివుంది. ప్రభుత్వం ప్రజల సందేహాలపై స్పష్టత ఇస్తే గానీ అధికారులు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇంటింటా సర్వే వుంటుందా? లేదా ఆన్‌లైన్‌ ఎంట్రీ ఆధారంగానే ఎంపిక చేస్తారా? అనే సందేహాలు ఉన్నాయి. అధికారులు మాత్రం వడపోత కార్యక్రమం కచ్చితంగా ఉంటుందని చెబుతున్నారు. ఈనెల 17తర్వాతే స్పష్టమైన మార్గదర్శకాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

● మూడు రోజుల పాటు సంప్రదాయబద్ధంగా పెద్ద పండుగ ● ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● గ్రామాలు, పట్టణాల్లో సందడి


మొయినాబాద్ రూరల్: ఎన్కెపల్లిలో గల తన వ్యవసాయ క్షేత్రంలో పతంగిని ఎగురవేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి


కందుకూరు: చిప్పలపల్లిలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ బాలక్రిష్ణ

ఆమనగల్లు/ కడ్తాల్/ తలకొండపల్లి, జనవరి 16: మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సహాల మధ్య జరుపుకున్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లోని గ్రామాల్లో, పట్టణాల్లో పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. కొత్త సంవత్సరంలో మకర సంక్రాంతివేడుకలు అంబురాన్నంటాయి. వలస పోయినవారు, బంధువులు, ఆడపడుచులు, కొత్త అల్లుల్ల రాకతో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. మొదటి రోజు భోగి, రెండోరోజు సంక్రాంతి, మూడో రోజు కనుమ పండుగలను జరుపుకున్నారు.మహిళలు,యువతులు సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులువేశారు. ఇళ్లలో పాలు పొంగించారు. యువకులు, పిల్లలు గాలిపటాలు ఎగరవేశారు. రైతులు ఎడ్లను అలంకరించి బండ్ల ప్రదర్శనలు నిర్వహించారు. తమకు భోగభాగ్యాలు ప్రసాదించాలని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.


ఇబ్రహీంపట్నం: తిరుమల హిల్స్‌లోని తన నివాసంలో మనవడు, మనవరాలిలో కలిసి గంగెద్దుతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి

శంషాబాద్: శంషాబాద్‌లోని వివిధ బస్తీలు, మండలంలోని గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. కూడళ్లలో పతంగులు, మాంజా దుకాణాలు వెలిశాయి. బస్తీల్లో యువకులు కేరింతలు కొడుతూ పతంగులు ఎగురవేశారు.

కొందుర్గు: మండలంలో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పండుగకు కొత్త అల్లుల్లు, బంధువులు రావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. మూడురోజుల పాటు ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. ఇళ్లలో పిండివంటలు ఘుమఘుమలాడాయి. కొందుర్గులో వాలీబాల్, క్రికెట్ టోర్నీ నిర్వహించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సై కృష్ణయ్య అన్నారు. పర్వతాపూర్‌లో క్రికెట్‌టోర్నీ ముగిసింది. ఫైనల్‌లో మాజీ సర్పంచ్ బలవంతరెడ్డి టీం, దర్గా వెంకటయ్య టీంలు తలపడగా బలవంత్‌రెడ్డి టీం విజయం సాధించింది. విజేతకు రూ.21వేలు, రన్నర్స్‌కు రూ.11వేలు, షీల్డ్‌లను ఎస్సై అందజేశారు. శ్రీధర్‌రెడ్డి, మల్లేష్ గౌడ్, యాదయ్య, అశోక్, వెంకట్‌గౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.


షాబాద్‌లో ముగ్గు వేస్తున్న బాలిక: చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మహిళ


కొందుర్గు : విజేత టీంకు షీల్డును అందజేస్తున్న ఎస్సై కృష్ణయ్య


మొయినాబాద్ రూరల్ : గాలిపటాలను ఎగరవేస్తున్న యువకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నగరంలోని తిరుమల హిల్స్‌లోని తన నివాసంలో వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి గంగెద్దుల విన్యాసాలను తిలకించారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎలిమినేడులోని తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో ఎక్కడచూసినా సంక్రాంతి సందిడి కన్పించింది. ఇదిలా ఉంటే ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల పట్టణాలకు చెందిన కొందరు ఏపీలోని భీమవరం ప్రాంతాల్లో కోళ్ల పందేల్లో పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్: సంక్రాంతి పండుగ సనాతక్రాంతి అని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్కెపల్లి గల తన వ్యవసాయ క్షేత్రంలో కుటుంబంతో కలిసి ఎంపీ వేడుకలు జరుపుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఎంపీ ఆకాంక్షించారు. వివిధ గ్రామాల్లోనూ సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

కందుకూరు: సంక్రాంతి పండగను ప్రజలు అట్టహాసంగా జరుపుకున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి ప్రతిభకనపర్చిన వారికి బహుమతులను అందజేశారు. కొందరు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మూడు రోజుల ముందే ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరానికి తరలి వెళ్లారు. అన్నోజిగూడ, చిప్పలపల్లి, ముచ్చర్ల, కందుకూరు గ్రామాల్లో మహిళలకు నిర్వహించిన ముగ్గులపోటీల్లో విజేతలకు ఆ గ్రామాల సర్పంచ్‌లు కాకి ఇందిరదశరథ, బాలక్రిష్ణ, రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, మల్లేశ్‌లు మంగళవారం నగదు బహుమతులు అందజేశారు.

షాబాద్: మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరానన్నంటాయి. మూడురోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పండుగను నిర్వహించుకున్నారు. ఆడపడుచులు, అల్లుళ్లు, బంధవులతో పండగ సందడి నెలకొంది. చిన్నా పెద్దా గాలిపటాలను ఎగురవేశారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిసి పాడి పంటలు బాగాపండాలని రైతులు భగవంతున్ని కోరుకున్నారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పీసరి సతీష్‌రెడ్డి అన్నారు. సంకాంత్రిని పురస్కరించుకొని నాలుగు రోజులుగా దామర్లపల్లిలో నిర్వహించిన దామర్లపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ముగిసింది. పోటీల్లో 20 టీంలు పాల్గొన్నాయి. మంగళవారం విజేతలకు బహుమతులు అందజేశారు. విజేత నర్సప్పగూడ టీంకు రూ.20వేలు, ట్రోఫీ, రన్నర్ రామంతాపూర్ టీం రూ.10వేలు, షీల్డ్ అందజేశారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ... క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకొని లక్ష్యంవైపు పయనించాలన్నారు. క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోకుల లింగం, గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్, యూత్ మండల ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అలీ, భీంలాల్‌నాయక్, దయాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

చేవెళ్ల: యువత క్రీడల్లో రాణించాలని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. రేగడిఘనాపూర్‌లో వాలీబాల్ టోర్నీ విజేతకు బహుమతులందజేశారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు.


ఆమనగల్లులో ముగ్గులు వేస్తున్న యువతులు


మక్తమాదారంలో స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, గ్రామస్తులు


శంషాబాద్‌లో పతంగులు, మాంజా అమ్మకాల దుకాణం


దామర్లపల్లిలో క్రీడలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీఆర్ఎస్ మండల యూత్ వింగ్ అధ్యక్షుడు పీసరి సతీష్‌రెడ్డి


కడ్తాల్: మైసిగండిలో సంక్రాంతి వేడుకల్లో కుటుంబ సభ్యులతో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్


ఆమనగల్లులో గాలిపటాలతో పిల్లలు, గ్రామస్తులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

కొత్తూర్, జనవరి 16: క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని, ఓడిన క్రీడాకారులు గెలుపు కోసం కృషి చేయాలని ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ తండాలో సర్పంచ్ రవినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలకు మంగళవారం ఎంపీపీ బహుమతులను ప్రదానం చేశారు. టోర్నీలో 8 టీంలు తలపడగా.. మల్లాపూర్‌తండా టీం విజేతగా, మక్తగూడ టీం రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఎంపీపీ మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దశరథ్‌నాయక్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, రవినాయక్, జయేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, దయానంద్‌రెడ్డి, పాపిరెడ్డి, నారాయణ, రెడ్యా, శ్రీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో...

సిద్దాపూర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీ మంగళవారంతో ముగిసింది. విజేతగా గణేష్ టీం, రన్నర్‌గా మధు టీం నిలిచాయి. విజేతలకు శేఖర్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లారం నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాశుల జంగయ్య, నాయకులు చిన్నారెడ్డి, మహేందర్‌రెడ్డి, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


విజేతలతో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

వసతి గృహాన్ని ఎత్తివేశారు.. భవనాన్ని వృథాగా వదిలేశారు

● ఆమనగల్లులో నిరుపయోగంగా బీసీ హాస్టల్ భవనం
● రూ.కోట్ల విలువ చేసే స్థలం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం
● విద్యార్థుల్లేరని ఐదేళ్ల క్రితం హాస్టల్ మూసివేత
● ఇక్కడ బీసీ గురుకులాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు, తల్లిదండ్రుల మొర


ఆమనగల్లులో వినియోగంలో లేక నిరుపయోగంగా మారిన బీసీ హాస్టల్

ఆమనగల్లు, జనవరి 16: దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఆమనగల్లు బీసీ హాస్టల్‌ను ఐదేళ్ల క్రితం ఎత్తివేశారు. వసతి గృహాన్ని ఎందుకు ఎత్తివేశారో స్థానికులకు అర్థం కాని పరిస్థితి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. బీసీ వసతి గృహాన్ని పునరుద్ధరించాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్, వెల్దండ మండలాల బీసీ విద్యార్థుల కోసం 40ఏళ్ల క్రితం హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ వెనుక మాడ్గుల రోడ్డును అనుసరించి విశాల భవనాన్ని నిర్మించారు. అప్పట్లో సుమారు 200 మంది విద్యార్థుల వరకు ఈ హాస్టల్‌లో ఉంటూ స్థానిక పాఠశాలల్లో చదివేవారు. పేద పిల్లలకు ఈ హాస్టల్ సౌకర్యంగా ఉండేది. కాగా ప్రజాప్రతినిధులు, అధికారుల ఉదాసీనత కారణంగా హాస్టల్‌లో సమస్యలు పేరుకుపోయాయి. భవనం శిథిలావస్థకు చేరుకుంది. క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఉన్న విద్యార్థుల్లోనూ ఎస్టీలు ఎక్కువై బీసీ విద్యార్థులు తక్కువయ్యారు. ఈ క్రమంలో 120 మంది విద్యార్థులున్న హాస్టల్ సొంత భవనంలో వసతులు లేక, భవనం కూలిపోయే దశకు చేరుకోవడంతో 2016లో కల్వకుర్తి రోడ్డులోగల అద్దె భవనంలోకి హాస్టల్‌ను మార్చారు. అక్కడ ఏడాదికే సరైన నీటి వసతి, ఇతర సౌకర్యాలు లేక విద్యార్థుల సంఖ్య సగానికి పడిపోయింది. ఇదిలా ఉంటే అప్పట్లో స్థానిక ఎస్సీ హాస్టల్లోనూ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో జిల్లా ఉన్నతాధికారులు కొందరు వసతి గృహ అధికారుల ఒత్తిడితో పిల్లలు లేనిదే అద్దె భవనంలో వసతి గృహాన్ని నడపడం ఎందుకని బీసీ వసతి గృహాన్ని అద్దె భవనం నుంచి 2017లో ఎస్సీ వసతి గృహంలోకి మార్చారు. క్రమంగా బీసీ విద్యార్థులు తగ్గడం, స్థానికులు చొరవ తీసుకోకపోవడంతో అధికారులు 2018లో ఆమనగల్లు బీసీ హాస్టల్‌ను మొత్తానికే ఎత్తివేశారు. దీంతో కోట్ల రూపాయలు విలువ చేసే వసతి గృహ పాత భవనం, స్థలం వృథాగా మారాయి. భవనం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని స్థానికులంటున్నారు. పాత భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించి బీసీ గురుకులం, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు కడ్తాల మండల సమావేశం

కడ్తాల్, జనవరి 16: మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్‌లో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.ఎంపీపీ కమ్లీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీ రాములు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన ఆసిఫ్ అలీ



కడ్తాల్, జనవరి 16: రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ ఆసిఫ్ అలీ మంగళవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కొన్ని రోజుల క్రితం స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని స్పీకర్ తనకు సూచించారని ఆసిఫ్ అలీ తెలిపారు.

ఎస్‌టీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి


ఉప ముఖ్యమంత్రి విక్రమార్కను సన్మానిస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల, జనవరి 16: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య అన్నారు. మంగళవారం ప్రగతిభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సైదులు, జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌చారి, ప్రధాన కార్యదర్శి గోపాల్, చేవెళ్ల మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి రాంచంద్రయ్య, నాయకులు రమేష్, సుధాకర్, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్' క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, నాయకులు

కడ్తాల్, జనవరి 16: ఎక్వాయిపల్లిలో మంగళవారం వికసిత్ భారత్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 2024 క్యాలెండర్‌ను అధికారులు,ప్రజాప్రతినిధులు, నాయకులు, సర్పంచ్ జంగం సుగుణసాయిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, వెంకటేశ్, సుబ్రహ్మణ్యం, లక్ష్మి, అరుణ, హంసమ్మ, శాంతి, శ్రీను, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన 'గూడూరు'

కడ్తాల్, జనవరి 16: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి నగరంలో మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రికి వారు పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంట పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి సూచించినట్లు నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగిర్‌బాబ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, నాయకులు మల్లేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్ ఉన్నారు.


మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

ధ్వంసమైన రోడ్డుపై ప్రయాణమెలా?

● నరకప్రాయంగా మూడు జిల్లాలను కలిపే ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు
● పట్టించుకోని అధికారులు, పాలకులు


పూర్తిగా బీటీ లేచిన జంగారెడ్డి పల్లి-చంద్రాయన్‌పల్లి రోడ్డు

ఆమనగల్లు, జనవరి 16 : పాలకుల నిర్లక్ష్యానికి మూడు జిల్లాలను కలిపే ఆమనగల్లు-చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు అద్దం పడుతోంది. ఏళ్లుగా పాడైన రోడ్డుతో ప్రయాణికులు నరక యాతన పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ బీటీ రోడ్డు అడుగడుగునా కొట్టుకుపోయి, కంకర తేలి, మోకాళ్లలోతు గోతులేర్పడి ప్రమాదకరంగా మారింది. దెబ్బతిన్న రోడ్డుపై వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డు ఏళ్లుగా మరమతులకైనా నోచుకోవడం లేదు. దీంతో ఇది మట్టి రోడ్డును తలపిస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డును పదేళ్ల కింద ఆర్‌అండ్‌బీ పరిధికి మార్చారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి ఆమనగల్లు నుంచి సిరనగండ్ల మీదుగా మహబూబ్‌నగర్-మిర్యాలగూడ రహదారి చారగొండ వరకు 27కిలోమీటర్ల రోడ్డుకు ఐదేళ్ల క్రితం 12కిలోమీటర్లు పూర్తైంది. మరో 15కిలోమీటర్లు పూర్తి అయితే రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల మధ్య అనేక గ్రామాలకు రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. సింగిల్‌రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును ఆమనగల్లు నుంచి జంగారెడ్డిపల్లి వరకు, మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సిర్సనగండ్ల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. జంగారెడ్డిపల్లి సమీపం నుంచి చంద్రాయన్‌పల్లి వరకు మధ్యలో 10కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు వేయలేదు. సింగిల్ రోడ్డు కూడా దెబ్బతింది. జంగారెడ్డిపల్లి, మాలెపల్లి, పోలెపల్లి గేటు మీదుగా చంద్రాయన్‌పల్లి వరకు మరమతులైనా చేయడం లేదు. 7ఏళ్ల క్రితం సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా చేసేలా అధికారులు ప్రతిపాదనలు పంపగా.. నిధులు మంజూరై టెండర్లు నిర్వహించినా కాంట్రాకర్లు ముందుకు రాలేదని సమాచారం. డబుల్ రోడ్డు నిర్మాణం గురించి పలుమార్లు గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, ఉన్నతాదికారులకు విన్నవిస్తున్నా స్పందన లేదు. నిత్యం ఈ రోడ్డు మీదుగా వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పాడైన రోడ్డుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించి జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి డబుల్ రోడ్డును పూర్తి చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డు కోసం జెడ్పీటీసీ అనురాధపత్యానాయక్, పోలెపల్లి ఎంపీటీసీ దోనాదుల కుమార్, విండో వైస్‌చైర్మన్ సత్యం, ఏఎంసీ వైస్‌చైర్మన్ గిరియాదవ్‌లు పలుమార్లు గత ఎమ్మెల్యే జైపాల్‌కు వినతిపత్రాలందజేశారు. ఆయన చేస్తా.. చూస్తామన్నారు తప్ప కార్యాచరణ లేదన్న విమర్శలున్నాయి.

మృతుడి కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

తలకొండపల్లి, జనవరి 16: తలకొండపల్లి మండలం పెద్దూర్ తండాకు చెందిన నెనావత్ కిషన్‌నాయక్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.3వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ కిషన్‌నాయక్, ఎంపీటీసీ రఘునాయక్, నాయకులు రవి, కిషన్, సాయికుమార్, వినోద్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

20న కందుకూరు మండల సమావేశం

కందుకూరు, జనవరి 16: ఈ నెల 20న కందుకూరు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకట్రాములు మంగళవారం తెలిపారు. ఎంపీపీ మంద జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని, మండల అధికారులు తమ శాఖకు సంబంధించి సమాచారంతో రావాలని కోరారు.

క్రైం కార్నర్

ఫ్యాక్టరీ ఆవరణలో చెలరేగిన మంటలు

● స్పందించి ఆర్పివేసిన ఫైర్ సిబ్బంది


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆదిభట్ల, జనవరి 16: గతంలో కుర్చీల తయారీ పరిశ్రమ ఖాళీ స్థలంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పేసిన సంఘటన ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం ఫైర్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిభట్ల పరిధి ఎంపీ పటేల్‌గూడలో గతంలో ప్లాస్టిక్ కుర్చీల ఫ్యాక్టరీ ఉండేది. ప్రస్తుతం ఆ సంస్థ మూతపడింది. ఫ్యాక్టరీ ఖాళీ స్థలంలో కుర్చీల తయారీకి వినియోగించే ముడి ప్లాస్టిక్, ఫోమ్ పార్టికల్‌ను నిల్వ చేశారు. మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు దానిలో నిప్పువేయడంతో మంటలు చెలరేగి పొగలు కమ్ముకున్నాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. ఫైర్‌మెన్, ఇంజిన్ చేరుకొని మంటలార్పారు. మంటలు ఎగిసిపడితే పక్కనే ఉన్న రైస్‌మిల్లు, ప్లైవుడ్ ఫ్యాక్టరీకి అంటుకునేవి. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో ముప్పు తప్పింది. మంటలార్పేందుకు ఫైర్‌ఆఫీసర్, ఫైర్‌మెన్ నర్సింహ, చంద్రశేఖర్, ఆపరేటర్ జ్ఞానేశ్వర్ శ్రమించారు.